సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



సద్దుల సంబురం



చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జిల్లాలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆడి, పాదారు. అనంతరం నిమజ్జనం నిర్వహించారు. సుహాసినులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పండుగ సందర్భంగా ఊరూవాడా అంతటా సందడి నెలకొంది.



జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



న్యూస్‌రీల్

'నిర్దేశిత ఆర్పీఎంలోనే వరికోతలు చేపట్టాలి'



కామారెడ్డి క్రైం : జిల్లాలోని హార్వెస్టర్ యజమానులు తమ హార్వెస్టర్లను నిర్దేశిత ఆర్పీఎంలో ఉంచి వరికోతలు చేపట్టాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో హార్వెస్టర్ యజమానులకు వరి కోతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్వెస్టర్‌ను నిర్దేశిత ఆర్పీఎంలో ఉంచితే పొల్లు రాకుండా ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మేరకు ప్రాధాన్యత క్రమంలో వరి కోతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.

మెట్ట పంటల పరిశోధన కేంద్రం సందర్శన



కామారెడ్డి టౌన్: పటాన్‌చెరులోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రాన్ని సోమవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సందర్శించారు. కేంద్రం డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హరికిషన్‌రెడ్డిలతో మాట్లాడి వ్యవసాయ పరిశోధనల గురించి తెలుసుకున్నారు. కామారెడ్డిలో చిరుధాన్యాల సాగుకు రైతులకు అవగాహన కల్పించేందుకు సహకరించాలని వారిని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గుప్తా, ప్రకాష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా రవితేజ



కామారెడ్డి టౌన్: జిల్లాకు శిక్షణ డిప్యూటీ కలెక్టర్‌గా రవితేజ నియమితులయ్యారు. తాజాగా టీజీపీఎస్సీ గ్రూప్‌- 1 నుంచి నియామకం అయిన ఆయన సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

ఎనిమిదేళ్ల తరువాత జూనియర్ కళాశాలలకు నిధులు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ఇటీవల రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఎనిమిదేళ్ల తరువాత నిధులు రావడం గమనార్హం. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆయా కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ముఖ్యంగా నీటివసతి, మరమ్మతులు, నీటి పైపుల ఏర్పాటు, టాయిలెట్లకు మరమ్మతులు, డ్యూయల్ డెస్క్ వంటి పనులు చేపడతారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఎక్కువ సమస్యలు ఉన్న కళాశాలలకు అవసరాన్ని బట్టి నిధులు మంజూరు చేస్తున్నారు.

మోగిన నగారా!

జిల్లాలో మండలాలు	25
జెడ్పీటీసీ స్థానాలు	25
ఎంపీటీసీ స్థానాలు	233
గ్రామ పంచాయతీలు	532
వార్డులు	4,656
మొత్తం ఓటర్లు	6,39,730
పురుషులు	3,07,508
స్త్రీలు	3,32,209
ఇతరులు	13

- జిల్లాలో రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు
- పంచాయతీ ఎన్నికలు కూడా రెండు విడతల్లోనే...
- అమలులోకి ఎన్నికల కోడ్
- ఏర్పాట్లలో యంత్రాంగం బిజీ

99087 12421
కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులకోసం హెల్ప్‌లైన్ నంబర్



పల్లెపోరుకు తెరలేచింది. పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యింది. దీని ప్రకారం అక్టోబర్ 23న 14 మండలాల్లో, 27న మిగిలిన 11 మండలాల్లో పరిషత్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 31న 266 పంచాయతీలకు, నవంబర్ 4న మిగిలిన 266 పంచాయతీలకు పోలింగ్ ఉంటుంది. పంచాయతీ ఎన్నికల పోలింగ్ రోజే కౌంటింగ్ నిర్వహించనుండగా.. పరిషత్ ఎన్నికలకు సంబంధించిన ఓట్లను నవంబర్ 11న లెక్కించనున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'స్థానిక' సమరానికి ఎట్టకేలకు ముహూర్తం ఖరారయ్యింది. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో 25 మండలాలకు జెడ్పీటీసీ స్థానాలతో పాటు, 233 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే జిల్లాలోని 532 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులతో పాటు, 4,656 వార్డులకు సైతం రెండు విడతల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో పాటే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లపై ఫోకస్ చేసింది. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి శిక్షణ, కేంద్రాల మ్యాపింగ్ వంటి పనులు పూర్తిచేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

పంచాయతీ ఎన్నికలు...

గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా రెండు విడతల్లో జరగనున్నాయి. జిల్లాలో 532 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు, 4,656 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలయ్యింది. మొదటి విడతలో కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లోని 266 పంచాయతీలకు ఎన్నికలు ఉంటాయి. తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 17న విడుదలవుతుంది. ఆనాటినుంచి 19 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 20 న నామినేషన్లను పరిశీలిస్తారు. 23 న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల విరమణకు అవకాశం ఉంటుంది. అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 31న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

రెండో విడతలో గాంధారి, నిజాంసాగర్, పిట్లం, మహ్మద్‌నగర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలోని 266 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి అక్టోబర్ 21న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 21 నుంచి 23 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహిస్తారు. 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు గడువుంటుంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తులను ప్రకటిస్తారు. నవంబర్ 4న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు.

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు..

మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరుగుతాయి. తొలి విడత 14 మండలాల పరిధిలో 14 జెడ్పీటీసీ స్థానాలతో పాటు, 136 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కోసం అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదేరోజు నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12న నామినేషన్ల పరిశీలన పూర్తవుతుంది. 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదేరోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 23న పోలింగ్ జరుగుతుంది.

రెండో విడత 11 మండలాల పరిధిలోని 11 జెడ్పీటీసీ స్థానాలు, 97 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలై 15 న ముగుస్తుంది. 16న నామినేషన్ల పరిశీలన, 19 వరకు నామినేషన్ల విరమణకు అవకాశం ఉంటుంది. అదేరోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. రెండు విడతలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నవంబర్ 11న ఉంటుంది.

మొదటి విడతలో జరిగే ఎంపీటీసీ/జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

మండలం	ఎంపీటీసీ స్థానాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
భిక్కనూరు	14	18,708	20,404	02	39,114	67
బీబీపేట	08	10,003	10,802	00	20,805	38
దోమకొండ	09	11,548	12,918	00	24,466	44
కామారెడ్డి	06	8,824	9,890	00	18,714	37
మాచారెడ్డి	07	9,475	10,291	01	19,767	45
పాల్వంచ	06	8,016	9,098	00	17,114	33
రాజంపేట	08	10,771	11,692	00	22,463	44
రామారెడ్డి	10	12,843	14,218	00	27,061	56
సదాశివనగర్	12	15,856	17,202	01	33,059	67
తాడ్వాయి	09	12,298	13,807	00	26,105	54
గాంధారి	15	19,981	20,466	00	40,447	80
లింగంపేట	14	18,334	19,814	00	38,148	75
నాగిరెడ్డిపేట	10	12,032	13,831	00	25,863	50
ఎల్లారెడ్డి	08	9,839	11,054	00	20,893	47
మొత్తం	136	1,78,528	1,95,487	04	3,74,019	737

రెండో విడతకు సంబంధించి..

మండలం	ఎంపీటీసీ స్థానాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
బాన్సువాడ	11	14,105	15,340	02	29,447	65
బిచ్కుంద	10	13,984	14,557	03	28,544	51
బీర్కూర్	07	9,536	10,692	00	20,228	43
డోంగ్లీ	05	7,349	7,384	00	14,733	26
జుక్కల్	14	18,461	18,682	00	37,143	73
మద్నూర్	12	16,192	16,477	00	32,669	56
మహ్మద్‌నగర్	05	6,553	7,467	01	14,021	29
నస్రుల్లాబాద్	08	9,981	11,312	00	21,293	45
నిజాంసాగర్	05	6,775	7,504	00	14,279	29
పెద్దకొడప్‌గల్	07	8,819	9,008	01	17,828	36
పిట్లం	13	17,225	18,299	02	35,526	69
మొత్తం	97	1,28,980	1,36,722	09	2,65,711	522

నిజాంసాగర్‌లోకి భారీ వరద

నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,13,552 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 19 వరద గేట్లను ఎత్తి 1,25,307 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,400.55 అడుగుల (11.949 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు

ఎస్సారెస్పీలోకి..



ఎస్సారెస్పీ ద్వారా విడుదలవుతున్న నీరు

బాల్కొండ: ఎగువ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం రోజు 3.15 లక్షల క్యూసెక్కుల నీరు రాగా, అర్ధరాత్రి తరువాత 4.5 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. తరువాత క్రమంగా తగ్గుతూ సోమవారం రాత్రి వరకు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. 39 వరద గేట్ల ద్వారా 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం 4.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా సోమవారం తగ్గించారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 400, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 581 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం రాత్రి 1,083.30 (54.7టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, జిల్లా అధికారులు

కామారెడ్డి టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. సోమవారం ఆమె హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జిల్లా అధికారులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుపై పలు సూచనలు ఇచ్చారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్‌లను తొలగించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం, డబ్బు లేదా బహుమతులు తదితర కార్యక్రమాల ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పీవో, ఏపీవో, ఆర్వో, ఏఆర్వోలకు మొదటి విడత శిక్షణ పూర్తి చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాస్థాయి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించామన్నారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను గుర్తించామని, జిల్లాలో అవసరమైన బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, డీపీవో మురళి, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎల్‌పీవోలు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే అమలులోకి..

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయడానికి నోడల్ అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గ్రూప్–2 ఉద్యోగాలకు ఎంపిక


శ్రీజారెడ్డి

భిక్కనూరు: కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీజారెడ్డి భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో జియోఇన్ఫర్మెటిక్స్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకుంది. ఇటీవల గ్రూప్–2 పరీక్ష రాయగా, ఫలితాల్లో ఆమె ప్రతిభ చూపి ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికైంది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు నారాయణ గుప్త, ప్రతిజ్ఞ సోమవారం మాట్లాడుతూ.. శ్రీజారెడ్డి ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక అవడం హర్షణీయమన్నారు.

గ్రూప్1లో 94వ ర్యాంకు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి చెందిన మున్నం శశికుమార్ గ్రూప్1లో రాష్ట్రస్థాయి 94వ ర్యాంకు సాధించి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా ఉద్యోగాన్ని సాధించాడు. ఈమేరకు లేబర్ కమిషనర్ దాన కిషోర్ చేతుల మీదుగా ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. శశికుమార్ తల్లితండ్రులు సైతం ఉపాధ్యాయులుగా పని చేసి రిటైర్ అవ్వగా, తండ్రి ఇటీవలే మృతి చెందారు. భార్య మమత సైతం స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. తల్లి, భార్యల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు శశికుమార్ తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కల్లుడిపో సమీపంలో వర్షానికి ఓ ఇల్లు కూలిపోయింది. మండల కేంద్రానికి చెందిన సాకలి పెద్దొల్ల లక్ష్మీ భర్త అనారోగ్యంతో చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి గోడలు ధ్వంసమయ్యాయి. సోమవారం తెల్లవారుజామున కూలిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని లక్ష్మి కోరారు. ఇల్లు కూలిందని అధికారులకు తెలిసినా వచ్చి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి



పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు 'ఏ' గ్రేడు ధాన్యానికి రూ.2,389, 'బీ' గ్రేడు ధాన్యానికి రూ.2,369 మద్దతు ధర అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ, ఏఈవో సవిత, సీఈవో శ్యాం, డైరెక్టర్లు ఆలూర్ నారాయణ రెడ్డి, పుప్పాల ప్రవీణ్, నరేడ్ల గంగారాం, చిట్టెడి చిన్నయ్య, కుంట గంగారెడ్డి, మురళి, క్లెం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీబీపేటలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు..


మహమ్మద్ నగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

సరస్వతీ దేవిగా దుర్గమ్మ

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తుండగా సోమవారం సరస్వతీ మాత రూపంలో భక్తులను అనుగ్రహించారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లోని దుర్గామాత మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పుస్తకాలు, పెన్నులతో మాతను అలంకరించారు. పలు మండపాల్లో ప్రత్యేక కుంకుమార్చనలు, యజ్ఞాలు, భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. డోంగ్లీ మండలంలోని మొగా గ్రామంలోని సార్వజనిక్ దుర్గామాతను రూ.6లక్షల 11వేల నోట్లతో గ్రామస్తులు అలంకరించారు. భిక్కనూరులో అమ్మవారికి చప్పన్‌బోగ్ నైవేద్యాలను భక్తులు సమర్పించి ఓడిబియ్యం పోశారు.

–సాక్షి నెట్‌వర్క్


దోమకొండలో సరస్వతీ మాత అలంకరణలో అమ్మవారు


బిచ్కుందలో అన్నదానం


పెద్దకొడప్‌గల్‌లో..


గాంధారిలో..


దేవునిపల్లిలో దాండియా ఆడుతున్న మహిళలు


మద్నూర్‌లో..


హన్మాజీపేట్ గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు


గోపాల్‌పేటలోని దుర్గామాత మండపం వద్ద అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు






సదాశివనగర్‌లో..


రామారెడ్డిలో..


కామారెడ్డిలో..


కోటదుర్గమ్మ ఆలయంలో ఆగ్రో చైర్మన్ బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న ప్రజలు


మద్నూర్‌లో..


దేవునిపల్లిలో..

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



బీబీపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి అధికారి సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మండల కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి రాజకీయ నాయకుల ఫోటోలు, పేర్లు ఉండకూడదని, వాల్ పెయింటింగ్‌లు ఉన్నచోట పెయింట్ వేయాలని సూచించారు. అలాగే నాయకుల విగ్రహాల నాయకులకు ముసుగులు వేయాలని తెలిపారు. ప్రతిరోజు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ గంగసాగర్, ఆర్‌ఐ రాముల తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట: స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో రాజకీయ నాయకులకు సంబందించిన ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేటలోని ప్రభుత్వ భవనాలు, స్థలాలలో రాజకీయ నాయకులకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను అధికారులు తొలగించి వేశారు.

ఆరోపణలు అవాస్తవం

- జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం

ఖలీల్‌వాడి: తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, ఎవరో అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని జిల్లా జైలు సూపరింటెండెంట్ చింతల దశరథం 'సాక్షి'కి ఫోన్ ద్వారా సోమవారం తెలిపారు. విధుల్లో భాగంగా వివిధ అంశాలపై అందరి సమక్షంలో మాట్లాడుతామని, తనపై అనవసరంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సబబుకాదన్నారు. తనపై ఎలాంటి జుడీషియల్ విచారణ జరగడం లేదన్నారు. తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. మరోవైపు, ఇదే అంశంపై కామారెడ్డి జైలులోని జూనియర్ అసిస్టెంట్ ముందుకొచ్చి నిజామాబాద్ జైలు సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని వివరణ ఇచ్చారు. ఆరోపణలకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన ఉన్నతాధికారికి ఉత్తరం అందించారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



బిచ్కుందలో నిర్వహిస్తున్న మహాజన సభ

- వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి
- సొసైటీ మహాజన సభల్లో సభ్యుల తీర్మానం

బిచ్కుంద/పిట్లం/పెద్దకొడప్‌గల్: రైతులకు యూరియా, ఎరువులు తగినంత అందుబాటులో ఉంచాలని వివిధ గ్రామాల సొసైటీలు మహాజన సభల్లో తీర్మానించాయి. వర్షాలు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బిచ్కుంద, పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు సొసైటీల్లో సోమవారం మహాజన సభలు నిర్వహించారు. ఈసందర్భంగా సొసైటీ సభ్యులు, రైతులు పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ముఖ్యంగా రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని, యాసంగి వరి ధాన్యంపై బోనస్ ఇవ్వాలని, ఖరీఫ్ వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు. సొసైటీ చైర్మన్లు నాల్చార్ బాలాజీ, ఒంటరి శబ్దంరెడ్డి, సాయిరెడ్డి, హన్మంత్ రెడ్డి, వైస్ చైర్మన్ యాదవరావు, డైరెక్టర్లు, సీఈవో శ్రావణ్ కుమార్, బంతిలాల్, దస్తారుడ్డి, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.


రాంపూర్ గ్రామంలో..


పెద్దకొడప్‌గల్‌లో..

భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- ఎడపల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల తనిఖీ


ఎడపల్లి తహసీల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

బోధన్: భూ భారతి (రెవెన్యూ) సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా పర్యవేక్షించాలని తెలిపారు. ఎడపల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రెవెన్యూ దరఖాస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ దత్తాద్రి, ఉద్యోగులతో సమావేశమై దరఖాస్తులపై గ్రామాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువులోపు ఎస్ఐఆర్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అంతకుముందు ఎంపీడీవో ఆఫీస్‌ను సందర్శించి అధికారులు, ఉద్యోగులతో మండలంలోని కొనసాగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.

లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవాలి

బోధన్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లను కట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో ఇద్దరు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 10 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పంపిణీ చేశారు.పార్టీ గ్రామ అధ్యక్షుడు కిషోర్, నాయకులు తదితరులు ఉన్నారు.

నిలకడగా గోదారి.. నీటిలోనే పంటలు


తాడ్‌బిలోలి శివారులో నీటమునిగిన వరి

రెంజల్(బోధన్): ఉగ్ర గోదావరి నిలకడగా మారింది. ఎగువన మహారాష్ట్ర నుంచి భారీ వరద వస్తుండగా, స్థానికంగా మంజీర నది నుంచి వరద ఉధృతి తగ్గుతోంది. దీంతో గోదావరి నది పరీవాహక గ్రామాల్లో వేసిన పంటలు నీటిలోనే ఉన్నాయి. మూడు రోజులుగా వరద నీరు వదలక పోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య నిర్మించిన జాతీయ రహదారికి ఇరువైపులా పంట పొలాలు 15 ఫీట్ల లోతులో మునిగి ఉన్నాయి.

నిలిచిన రాకపోకలు

తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి బ్యాక్‌వాటర్‌తో రెండు గ్రామాల మధ్య ఉన్న వంతెనకు ఇరువైపులా రోడ్డుపై వరద నీరు నిలిచిపోయింది. నిజామాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను సాటాపూర్ నుంచి జాతీయ రహదారి మీదుగా గ్రామానికి నడుపుతున్నారు.


తాడ్‌బిలోలి–బోర్గాం గ్రామాల మధ్య రోడ్డుపై నిలిచిన వరద నీరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ శివారులో ఉన్న పొలంలో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. ఎస్సై సుష్మిత తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ శివారులోని రెండు 25 కేవీ, మరో రెండు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. సోమవారం ఉదయం గమనించిన రైతులు విద్యుత్ శాఖ ఏఈ నాగశ్వైర్వానీ, లైన్‌మన్ మనోహర్‌కు సమాచా రం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: హత్యాయత్నం కేసులో ఒకరికి నిజామాబాద్ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి సాయి సుధా ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా భక్తపూర్‌కు చెందిన షకీల్ తాగుడుగు బానిసై నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో సంచరించేవాడు. 18 అక్టోబర్ 2021న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఎస్ఎల్ఎస్ వైన్స్ వద్ద మద్యం తాగి గొడవచేస్తుండగా, షేక్ జలీల్ అనే వ్యక్తి గొడవ చేయొద్దంటూ షకీల్‌ను బెదిరించాడు. దీనిని మనస్సులో పెట్టుకున్న షకీల్, జలీల్‌పై దాడిచేయాలని నిర్ణయించుకొని తర్వాతి రోజు కత్తితో వైన్స్ వద్దకు వచ్చాడు. రెండో రోజు సైతం జలీల్ బెదిరించడంతో షకీల్ అతనిపై కత్తితో దాడిచేసి, కడుపులో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. వైన్స్‌లో పనిచేస్తున్న రమేశ్, సర్ఫరోజ్ ఖాన్ ఇద్దరినీ విడిపించి, జలీల్‌ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి షకీల్‌ను జైలుకు పంపారు. ఈ కేసులో పోలీసుల తరఫున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మినర్సయ్య వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

పోక్సో కేసు నమోదు

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. చందూర్ మండలంలో ఆరేళ్ల బాలికపై వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడటంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఇసుక లారీ పట్టివేత



వేల్పూర్: వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63 నెంబర్ జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కోరుట్ల నుంచి వచ్చిన ఇసుక లారీకి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్రాబాద్ శివారులో చిరుత సంచారం

- లేగ దూడపై దాడితో ఆలస్యంగా వెలుగులోకి..


పంచనామా నిర్వహిస్తున్న సెక్షన్ ఆఫీసర్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అమ్రాబాద్ శివారులోగల గుండ్యానాయక్ తండా అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు సోమవారం తెలిపారు. రెండ్రోజుల క్రితం 9 నెలల లేగ దూడపై దాడి చేసి ఎత్తుకెళ్లగా, కళేబరం గుర్తించడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మెగావత్ రమేశ్ ప్రతిరోజూ 60 ఆవుల మందను మేత కోసం అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్తాడు. మూడు రోజుల క్రితం ఆవుల మందలోని 9 నెలల లేగ దూడ కన్పించలేదు. సోమవారం కూడా ఆవుల మందను మేత కోసం తీసుకెళ్లగా, చిరుత ఆవుపై దాడికి యత్నించింది. గమనించిన రమేశ్ అరుపులు వేయడంతో అడవిలోకి వెళ్లిపోయింది. దాడిలో ఆవుకు స్వల్పంగా గాయమైంది. లేగ దూడపై కూడా చిరుత దాడి చేసిందని నిర్ధారణకు వచ్చిన రమేశ్.. దాని కోసం వెతకగా బండరాళ్ల మధ్య కళేబరం కన్పించింది. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారమివ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. చిరుత సంచరిస్తున్నట్లు సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్, బీట్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, వాచర్లు రవి, బీమా గుర్తించారు. ప్రజలు, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

ఆ మూడు మద్యం దుకాణాలకే తీవ్ర పోటీ!

- గత మద్యం పాలసీలో జిల్లాలోని మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల షాపులకు వందల్లో దరఖాస్తులు
- ఆయా దుకాణాల పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉండటమే కారణం

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం 2025–27 నూతన మద్యం పాలసీని అమలులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. ఈసారి కూడా గతంలో మాదిరిగానే మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల వైన్స్‌లను దక్కించుకోవడానికి వ్యాపారులు అధిక మొత్తంలో పోటీ పడుతారనే భావన ఎక్సైజ్ అధికారులలో వ్యక్తమవుతుంది. అందుకే అందరి చూపు ఆ మద్యం దుకాణాలపైనే నిలచి ఉంది.

రూ.6.50 కోట్ల ఆదాయం..

జిల్లాలో 2023–25 మద్యం పాలసీలో భాగంగా 102 వైన్స్‌లకు నాలుగువేల దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.80 కోట్ల ఆదాయం లభించింది. అందులో రూ.6.52 కోట్ల ఆదాయం కేవలం మానిక్‌భండార్, మోపాల్, ఏర్గట్ల వైన్స్‌లకు వచ్చిన దరఖాస్తుల ఫీజుతోనే లభించడం విశేషం. మానిక్‌భండార్ వైన్స్‌కు 112 దరఖాస్తులతో రూ.2.24 కోట్లు, మోపాల్ మద్యం దుకాణానికి 110 దరఖాస్తుల ద్వారా రూ.2.20 కోట్లు, ఏర్గట్ల వైన్స్‌కు 104 దరఖాస్తుల ద్వారా రూ.2.08 కోట్ల ఆదాయం వచ్చింది. ఆయా మద్యం దుకాణాల్లో రోజుకు రూ.2.50లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు లిక్కర్ విక్రయం అవుతుంది. ఈ మద్యం దుకాణాల పరిధిలో గ్రామాలు ఎక్కువగా ఉండటమే అందుకు కారణం అని అధికారులు చెబుతున్నారు.